www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 24 జనవరి 2025

5

చిత్తూరు

## నెలగా అందని తాగునీరు

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుత్తున్న గ్రామస్తులు

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** మండలంలోని పెరుమాళ్ళపల్లి పంచాయతీ దళితవాడలో నెల రోజులుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గురువారం గ్రామస్తులు నడివీధిలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని తాగునీరు బోరు మరమ్మతులకు గురైందని, స్థానిక సర్పంచ్‌కి నీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ తాగునీటి కోసం మహిళలు, గ్రామస్తులు దూరప్రాంతానికి వెళ్లి తెచ్చుకోవల్సి వస్తుందని ఇకనైనా తాగునీటి బోరును రిపేరు చేయించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# ఉత్సవాలు సరే.. భద్రతపై అవగాహనేది..

### ఏటా రోడ్డు ప్రమాదాల్లో పోతున్న ప్రాణాలు

**జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు.. రోడ్డుభద్రతా కమిటీ సమావేశాలు ఇలా సమావేశాలు సమాలోచనలకే పరిమితం అవుతున్న అధికారులు రోడ్డు భద్రతాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అనుకున్న స్థాయిలో అవగాహన కల్పించడంతో విఫలం అవుతున్నారు. పై నుంచి వస్తున్నా ఆదేశాలతో ఆర్‌టిఏ (రోడ్డు ట్రాన్స్‌ఫోర్టు ) అధికారులు పోస్టర్లు, బ్యానర్లు ర్యాలీలతో అక్కడక్కడా విద్యార్థులతో ర్యాలీలు అవగాహన సమావేశాలు సదస్సులు నిర్వహించి అయిందనిపిస్తున్నారు.**

గంగవరం వద్ద జరిగిన బస్సు యాక్సిడెంట్ (ఫైల్ ఫొటో)

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** జిల్లాలో ఆర్‌అండ్‌బి, పంచాయతీ రాజ్ రోడ్లు గుంతలమయ్యాయి. యాదమరి మండలంలో యాదమరి -పరదరామి రోడ్డు అత్యంత దయనీయమైన పరిస్థితి పూర్తిగా దెబ్బతిని అటువైపు ప్రయాణం చేయలేక వాహనదారులు తుమిదపాళ్యం, వేలూరు మీదుగా చుట్టుకొని ప్రయాణం చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రోడ్డుమరమ్మతులపై దృష్టి సారించి నిధులు కేటాయించినా గత రెండేళ్ళుగా ఈ ప్రాంతంలో రోజుకో రోడ్డు ప్రమాదం చోటు చేసుకొనేది.. పాలకుల నిర్లక్ష్యంపై ఇక్కడి గ్రామస్తులు అనేక సందర్భాల్లో రోడ్డుపై నిరసనలు వ్యక్తం చేశారు.

వేలూరు రోడ్డు పరిస్థితి ఇంతే.. జిల్లాలో దాదాపు రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.72 కోట్లు మంజూరు చేసినా సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు ఉండాలంటూ ఆదేశించినా నేటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తికాక ఆర్ అండ్ బి రోడ్లపై గుంతలు కనిపిస్తున్నాయి. ఇలాంటి గుంతల వల్ల ద్విచక్రవాహనాల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చిత్తూరు జిల్లా పరిధిలో గత మూడు సంవత్సరాల కోసం 350 మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కొల్పోయారు. గత సంవత్సర కాలంలో 120 మంది రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. పలమనేరు ఘాట్ రోడ్డులో ఘోరమైన రోడ్డు ప్రమాదం ఇటీవల గంగాసాగరం వద్ద చోటు వోల్వా బస్సు ప్రమాదం నెత్తిటి మరకలు నేటికి చెరిగిపోలేదు. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో 50శాతం ద్విచక్రవాహదారులు ఉన్నారు. ఈ ప్రమాదాల్లో 90 శాతం రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా హెల్మెట్ ధరించకుండా అతివేగంగా ప్రయాణించడమే కారణం.

### ప్రమాద సూచికలు ఏవీ..

రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాతీయ, రాష్ట్ర రహదార్లుల్లో ప్రమాదాపు మలుపుల వద్ద సిగ్నల్ లైట్స్, సూచిక బోర్డులు ఉండాలి. మొగిలి ఘాట్‌రోడ్డు ప్రమాదానికి కారణంగా మలుపువద్ద సూచిక బోర్డు, సిగ్నల్ లైట్స్ లేకపోవడమే. జిల్లాలోని అనేక జాతీయ, రాష్ట్ర రహదార్లపై ఎలాంటి సూచిక బోర్డులేవు. సిగ్నల్ లైట్లు అంతమాత్రమే.. రాత్రి సమాయాల్లో ఎక్కడ గుంత ఉందో తెలుసుకోవడం ఎదురుగా వస్తున్న కాంతివంతమైన లైటింగ్‌కు కనిపించే పరిస్థితి లేదు. రోడ్డు భద్రతా సమావేశాల్లో సూచిక బోర్డులు, సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తున్నా ఆ మేరకు క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదనేది వాస్తవం.

### మాసోత్సవాలు సరే.. అవగాహన ఏదీ..

ప్రమాదాలు చోటు చేసుకున్న తరువాత ప్రమాదానికి గల కారణాలు అన్వేషించడం పరిపాటిగా మారిపోతోంది. జిల్లాలో 19 ప్రమాద స్పాట్లగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించడం లేదు. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు 36వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ నిర్వహిస్తోంది. ఏడాదికో సారి మాసోత్సవాలు నిర్వహించడంతో పాటు ప్రమాదాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతం ప్రచారం చేయడం, హెల్మెట్ వాడకం తప్పనిసరి చేయడం, రోడ్లపై ఏర్పడ్డ గుంతలు పూడ్చడం వంటి చర్యలు చేపట్టడం వల్ల ప్రమాదాలను తగ్గించవచ్చు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం, రోడ్డు రవాణా సంస్థ కృషి చేయాలని వాహదారులు కోరుతున్నారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారిని రూ.10వేలు జరిమానా విధించడంపై శ్రద్ధపెడుతున్న ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ లేకుండా వాహనం నడపుతున్న వారిని అసలు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

రొంపిచెర్ల వద్ద జరిగిన ప్రమాదం

## పొగ మంచు కారణంగా రెండు లారీలు ఢీ

**ప్రజాశక్తి-రొంపిచర్ల**

పీలేరు- చిత్తూరు హైవే రోడ్డుపైన పులిచెర్ల మండలం కల్లూరు ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద గురువారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కల్లూరు సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పొగ మంచు కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్సై తెలిపారు.

## సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

### రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** ప్రైవేటు పెట్టుబడితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటూ పాలకులు చెబుతున్న మాటలు ఆచరణ సాధ్యం కాదని, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ లేనందువల్ల అభివృద్ధి జరగడం లేదని సిపిఎం 27వ మహాసభ సందర్భంగా 'రాష్ట్ర సమగ్రాభివృద్ధి ప్రత్యామ్నాయ విధానాలు' పై చిత్తూరులో గురువారం నిర్వహించిన సమావేశంలో పలువురు వ్యక్తులు స్పష్టం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ పెట్టుబడి పుష్కలంగా ఉన్నా దానికి తగిన డిమాండ్ ప్రజలనుండి లేదని, ప్రజల ఆదాయాలు పెరగకపోవడం దీనికి కారణమని చెప్పారు. ప్రభుత్వానికి జవాబుదారి తనం, స్పష్టమైన ప్రణాళికలు, నిర్ధిష్టమైన కార్యాచరణ అవసరమన్నారు. దేశానికి చెందిన పెట్టుబడిదారులతో సిఎం చంద్రబాబు దావోస్‌లో ఒప్పందాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పెట్టుబడులు రాష్ట్రానికి వస్తే సంతోషమేనని, గతంలో ఎన్నో సార్లు ఈ సదస్సుల్లో చేసుకున్న ఒప్పందాలు ఫలప్రదమైన సందర్భాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ఈరోజు ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచాల్సిన అవసరం ఉందని, అందుకు వేతనాలు, రైతు కూలీల ఆదాయాలు పెరగాలని, వ్యవసాయం పునాదిగా పరిశ్రమలు అభివృద్ధి కావాలన్నారు. ఇది ఎంతో కీలకమైన అంశమైనప్పటికీ ఈ అంశం విజన్ 2047లో చోటు లేదన్నారు. ప్రణాళిక రూపొందిస్తే వాస్తవికంగా ఉండాలన్నారు. ఇందులో అనుసరించిన విధానం 'వాటర్ ఫాల్' దీర్ఘకాలమైందని, తక్షణం రాబోయే 5సంవత్సరాలకు ప్రణాళిక రూపొందించాలని ఇందుకు ప్రత్యామ్నాయంగా ఎక్సెల్ విధానం అనుసరణీయమన్నారు. 2029 నాటికి సాధించాల్సిన లక్ష్యాలను విస్మరించి 2047 రంగుల కలలను సృష్టించడం ప్రజలను మభ్యపెట్టడమేనని తెలిపారు. వందల కోట్ల స్థాయిలో ఖర్చు చేసి అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులకు కేటాయిస్తే రాయలసీమకు నీళ్లొస్తాయని, ఈ విషయాన్ని విస్మరించి గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు వేల కోట్లుతో చేపడతామనడం రాయలసీమ ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీకి 150ఎకరాలు ఇచ్చినా ఇంతవరకూ పునాది వేయలేదన్నారు. కాకినాడ సెజ్‌లో 10వేల ఎకరాల్లో బొమ్మల పరిశ్రమ ఒక్కటితప్ప పరిశ్రమలే లేవన్నారు. 18వేల ఎకరాల్లో ఉన్న వాన్ పిక్ సెజ్‌లో, హిందుపూర్‌లో నాలెడ్జ్ హబ్‌లో ఒక్క పరిశ్రమ లేదన్నారు. కేటాయించిన భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొంది ఎగనామం పెడుతున్నారని చెప్పారు. ఇదంతా స్పెక్యులేషన్‌కు తప్ప నిజమైన అభివృద్ధికి తోడ్పడదన్నారు. రాష్ట్రాల అధికారాలను కేంద్రం తన చేతుల్లోకి తీసుకుంటుందన్నారు. అయినప్పటికీ వెనుకబడిన ప్రాంతాలకు ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. మన రాష్ట్రానికి అవసరమైన పెట్టుబడులు పెట్టేవారు ఈ రాష్ట్రంలోనే ఉన్నారని చెప్పారు. వీళ్లంతా విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించి ప్రత్యామ్నాయ ప్రణాళికను త్వరలో జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో ప్రవేశపెట్టి చర్చించడం జరుగుతుందన్నారు. ఈ ప్రణాళికలో ప్రజలు, వివిధ వర్గాలు, సంఘాల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకునేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉందని ఇటీవలే సిఎం చంద్రబాబు చెప్పారన్నారు. అటువంటి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రం అందించే సహకారం ముఖ్యమన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి వంటి గత పదేళ్లలో కేంద్రం అమలు చేయకపోవడంతోనే రాష్ట్రం వెలిటేలర్‌పై ఉండటానికి కారణమన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు సురేంద్రన్, ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, నాయకులు బాలసుబ్రమణ్యం, దాము, మురళి,చిరంజీవిమ్మ, సంతోష్ , జ్యోతి పాల్గొన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** మండలంలోని పెద్ద కాల్వ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులు ట్రైనీ కలెక్టర్ హిమవంశి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో సౌకర్యాలు, కూలీలు ఇతర అంశాల పట్ల పలు సూచనలు చేశారు. అనంతరం యలమరాజుపల్లిలోని రాజారెడ్డి మినీ గోకులం షెడ్లను పరిశీలించారు. సిసి రోడ్డు పనులను పర్యవేక్షించి సిబ్బందితో చర్చించారు. ఉపాధి పనులలో నాణ్యత ప్రమాణాన్ని దృష్టిలో ఉంచుకొని పనులు నిర్వహించాలని సూచించారు. ఉపాధి హామీ ఏపీఒ శ్రీనివాసులు, ఏపీడి డాక్టర్ బాలసుబ్రమణ్యం, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశి

## ఎస్పీ కి ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారం

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** 2024 ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించినందుకు గాను ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారంకు చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఎంపికయ్యారు. ఈనెల 25వ తేదీన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలో జిల్లా ఎస్పీ పురస్కారం అందుకోనున్నారు. 2024 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల సందర్భంగా చిత్తూరు జిల్లాలో ఎన్నికలను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పారదర్శకతతో నిర్వహించి, శాంతిభద్రతలకు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించినందుకు గాను ఎస్పీని ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారంకు ప్రధాన ఎన్నికల అధికారి ఎంపిక చేశారు.

## నేతాజీ జీవితం యువతకు ఆదర్శం

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** భారత స్వాతంత్ర సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128 వ జయంతి వేడుకలను గురువారం చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు రామ్మూర్తి మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో మగ్గిపోతున్న ప్రజలకు అండగా నిలిచి బ్రిటిష్‌ని గడగడలాడించిన భరతమాత ముద్దుబిడ్డ నేతాజీ అని కొనియాడారు. సుభాష్ చంద్రబోస్ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమన్నారు. జయకుమార్, గుత్తా ప్రభాకర్ నాయుడు, తోటపాళ్యం వెంకటేష్, మురళి పాల్గొన్నారు.

**సోమల:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని కళాశాల విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించి అనంతరం విద్యార్థులకు ఆయన జీవిత విశేషాల గురించి తెలియజేశారు. 1942 సంవత్సరంలో భారత సైనికులు జపాన్ దేశంలో సుభాష్ చంద్రబోస్ గారికి నేతాజీ అనే బిరుదు ఇవ్వడం జరిగిందని అప్పటినుండి నేతాజీ సుభాష్ చంద్రబోస్‌గా ప్రాచుర్యం పొందారని విద్యార్థులకు తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్ మాట్లాడుతూ దేశభక్తి కలిగిన స్వాతంత్ర సమరయోధుల్లో సుభాష్ చంద్రబోస్ తన పోరాటాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమలలో..

చిత్తూరులో..

**పలమనేరు:** పలమనేరులో గురువారం టవర్ క్లాక్ వద్ద భరతమాత ముద్దుబిడ్డ నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ సైనికులు, సిద్దయ్య మాజీ ఉపాధ్యాయులు, తాతయ్య నాయుడు, టిడిపి నాయకులు ఆర్‌వి బాలాజీ, గిరి బాబు నేతాజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించినారు.

పలమనేరులో..

## ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

చిత్తూరులో..

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ :** రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు నగరంలో పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. గాంధీ విగ్రహ కూడలి, 5వ డివిజన్లో అన్నదానం చేశారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం, స్థానిక అన్న క్యాంటీన్ వద్ద భారీ కేక్ కట్ చేశారు. మేయర్ ఎస్.అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, జిల్లా పార్టీ అధ్యక్షులు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**తపోవనం పాఠశాలలో..**

టిడిపి సీనియర్ నేత కాజూరు బాలాజీ నేతృత్వంలో చిత్తూరు తపోవనం పాఠశాలలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు పుట్టినరోజు వేడుకలను విద్యార్థుల నడుమ ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు తరపున విద్యార్థులకు స్వీట్స్ పంచిపెట్టారు. తపోవనం పాఠశాల నిర్వాహకులు వీర రాఘవ నాయుడు, కోదండ యాదవ్, కాజూరు శ్రీనివాసులు, రాజశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

**యాదమరి:** పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం వద్ద నారా లోకేష్ జన్మదిన వేడుకల ఘనంగా జరిపారు. ఈ వేడుకల్లో భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, ప్రధానకార్యదర్శి వెంకటేష్ రబ్బీ, అమరనాథ్ నాయుడు, హేమగిరి చిట్టి, వి.చిత్ర నాయుడు, పారిశ్రామిక వేత్త నిత్యానంద పాల్గొన్నారు.

**రొంపిచర్ల:** మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు రొంపిచర్ల టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ అభిమానుల మధ్య భారీ కేక్ ను కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మండల అధ్యక్షుడు, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, ఓబులేశ్వర్ రెడ్డి, మదనమోహన్ రెడ్డి, రవి నాయుడు పాల్గొన్నారు. అలాగే పులిచెర్ల మండల కేంద్రంలో చల్లా రామచంద్రారెడ్డి విచ్చేసి కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

యాదమరిలో..

రామకుప్పంలో..

**పూతలపట్టు:** రాష్ట్ర విద్యా ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం పూతలపట్టు మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. చిత్తూరు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి గోపి, కన్వీనర్ దొరబాబు, యువరాజుల నాయుడు, హిమగిరి నాయుడు ప్రభుత్వాసుపత్రిలోనే రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు.

**గంగాధర నెల్లూరు:** గంగాధర నెల్లూరు బస్టాండ్ కూడలిలో మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు భారీ కేకును కట్ చేసి తినిపించుకున్నారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, మండల అధ్యక్షుడు స్వామిదాస్, శ్రీధర్ యాదవ్, దేవసుందరం, నియాజ్ అలీ, జీవరత్నం, శాంత కుమార్, చిట్టిరెడ్డి పాల్గొన్నారు.

**ఎస్ఆర్ పురం :** మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లిమిట్ట కూడలిలో ఐటీ మంత్రి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా టిడిపి జిల్లా నాయకులు గంధమనేని రాజశేఖర్ నాయుడు, సూరిరెడ్డి హేమాద్రి యాదవ్, బ్రహ్మయ్య నాయుడు, గురునాథం, ప్రహల్లాదన్, కార్తీక్, సాయి కిరణ్ భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

**సోమల:** యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో ఘనంగా నిర్వహించి భారీ కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పాలు పంచిపెట్టారు. మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, పిఎం.మల్లికార్జున, బాలకృష్ణ నాయుడు, సతీష్, అష్రఫ్ అలీ, భానుప్రకాష్ నాయుడు, మణి, చినబాబు, శ్రీనివాసులు నాయుడు, మోహన, చంద్రన్న, చాణక్య పాల్గొన్నారు.

**శాంతిపురం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ విద్యశాఖ మంత్రి నారా లోకేష్ విజనరీ లీడర్ అని, తండ్రిబాటలో ప్రజాసేవ వైపు మొగ్గు చూపారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. రాష్ట్ర సంక్షేమాభివృద్ధి కోసం తండ్రి చేస్తున్న ప్రయత్నాల్లో తన వంతు సహాయసహకారాలు అందిస్తూ ముందుకు కొనసాగుతున్నారని రాష్ట్ర యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు శ్రమిస్తున్న యువనేత నారా లోకేష్ ఇలాంటి ఎన్నో జన్మదినోత్సవాలు జరుపుకోవాలన్నారు.

**సదుం :** రాష్ట్ర మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మండల కన్వీనర్ రెడ్డి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి, నాయకులు అభిమానులు పంచుకున్నారు. ఉపాధ్యక్షుడు వై.మున్రెడ్డి, వై.వెంకట రమణారెడ్డి, బి.నారాయణ, వై.శ్రీనివాసులు రెడ్డి, అమర్నాథ్ గౌడ్, వెంకటరత్న, మారుతీ రెడ్డి, పవన్ కుమార్ పాల్గొన్నారు.



సోమలలో..



సదుంలో..

రొంపిచెర్లలో..

**తవణంపల్లి:** ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా మండలం మల్లకుంట సెగ్మెంట్ టిడిపి మాజీ ఎంపిటిసి వి.రవిప్రసాద్ విజయవాడలోని మంత్రి కార్యాలయంలో గురువారం కలిసి పుష్పగుచ్చం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని సమస్యల తెలుపగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

**పలమనేరు:** పట్టణంలోని టవర్ క్లాక్ సర్కిల్‌లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి పలువురుకి పంచి పెట్టారు. పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు, బాలాజీ, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు, ఖాజా, మదన్, అమరనాథ రెడ్డి, కుమార్, కిరణ్, చిన్నీ, భాస్కర్, సోమశేఖర్, ప్రమీల పాల్గొన్నారు.

**రామకుప్పం:** గురువారం టిడిపి కార్యాలయంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేశారు. అలాగే కుప్పం టిడిపి కార్యాలయంలో టిడిపి, నేతలు కార్యకర్తలు యువనేత లోకేష్ జన్మదిన సందర్భంగా రక్తదానం చేశారు. రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శుల నరసింహులు, ఆంజనేయ రెడ్డి, సీతాపతి, రామ్మూర్తి, చిన్నకృష్ణ, చలపతి, నందా రెడ్డి, సుబ్రీ, విజయ్ కుమార్ రెడ్డి, రఫీ, పెరుమాళ్, వెంకటరమణ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

## మామిడి రైతులకు అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మధుసూదన్ రెడ్డి

**ప్రజాశక్తి- పలమనేరు:** మండలంలోని వెలుగు ఆఫీస్ మీటింగ్ హాల్‌లో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం మామిడి రైతులకు మామిడిలో పూత, పిందె దశలో చేపట్టవలసిన సస్యరక్షణపై జిల్లా ఉద్యాన అధికారి డాక్టర్ మధుసూదన రెడ్డి అవగాహన కల్పించారు. మామిడిలో పూత కాలం మొదలవుతున్న క్రమంలో పూత అంతా ఒకేసారి రావడానికి పొటాషియం నైట్రేట్ (13:00:45) 10 గ్రాములు, అర్కా మాంగో స్పెషల్ 5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే మొగ్గ దశలో ఆశించే ప్రధాన చీడ, పీడల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కాయలు వృద్ధి చెందే దశలో కాయలకు కవర్లు కట్టడం వలన నాణ్యమైన కాయలు పొంది మంచి ధర పొందే అవకాశం ఉందని సూచించారు. అలాగే మామిడిలో పూత నుండి కాయ కోత వరకు తీసుకోవలసిన సస్య రక్షణ కరపత్రాలను రైతులకు అందించారు. జగదీష్ నాయుడు, నాగరాజురెడ్డి, దొరస్వామి నాయుడు, జి.మధుసూదన్ రావు, మల్లేశ్వయ్యా, ఉమాపతి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

## రూట క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాశక్తి- యాదమరి:** చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్ మోహన్ రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. గురువారం చిత్తూరు పివికేఎన్ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిగా హాజరై ఉర్దూ టీచర్స్ యూనియన్ రూట క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రూట వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, రాష్ట్ర నాయకులు ఖలందర్ బాషా, ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఖాన్, జిల్లా అధ్యక్షులు మునీర్ అహ్మద్, డాక్టర్ రహంతుల్లా, నఖీయుల్లా ఖాన్, వసీవుల్లా భక్తీయార్, రబ్బానీ, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

## నూతన వీధి దీపాలు ఏర్పాటు

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** మండలంలోని తూగుండ్రం పంచాయతీలో గురువారం కొత్త వీధిలైట్లు మరమ్మతులు చేసి విద్యుత్ పోల్స్‌కు అమర్చారు. తూగుండ్రం పంచాయతీ పరిధిలోని తాటిమాకుల కండ్రిగ, పిల్లారి కుప్పం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు అమర్చిన వీధి దీపాలు కొన్ని మరమ్మతుకు గురి అయ్యాయి. దీంతో స్థానిక సర్పంచ్ శ్రీబాబు విద్యుత్ అధికారుల సహకారంతో వాటి స్థానంలో నూతన విద్యుత్ వీధిలైట్లను ఏర్పాటు చేశారు.

## తూగుండ్రంలో పారిశుద్ధ్య పనులు

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** మండల పరిధిలో ఉన్న తూగుండ్రం పంచాయతీలో గురువారం స్థానిక సర్పంచ్ శ్రీ బాబు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. సెక్రటరీ మురళి తన సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య పనులను చేపట్టారు. పంచాయతీలోని ఆవలకొండ, తూగుండ్రం రెండు గ్రామాలలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త కుప్పలను తొలగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నియాజ్ అలీ పాల్గొన్నారు.

## రఘునాథ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

**వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ ఇన్చార్జి కృపా లక్ష్మి**

**ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం:** మండలంలోని ఎన్ఆర్. పురం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి మృతి వైఎస్ఆర్సిపికి తీరనిలోటని గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి కృపాలక్ష్మి అన్నారు. రఘునాథరెడ్డి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందారు. గురువారం సమాచారం అందుకున్న కృపాలక్ష్మి, రఘునాథ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు స్థానిక సర్పంచ్ మండల సర్పంచ్ల సంఘ అధ్యక్షుడు దిలీప్, కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని వేళల రఘునాథరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. జిల్లా ఉపాధ్యక్షులు గురువారెడ్డి, మండల అధ్యక్షులు మణి, ఎంపీపీ సరిత జనార్ధన్, కుప్పయ్య, మంగుంట మునికృష్ణ ఉన్నారు.

## వరదయ్యకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** మండల కేంద్రంలోని బంగారుపాళ్యం ఎంపీటీసీ ఉషారాణి భర్త వరదయ్య గత కొంతకాలంగా బ్రెయిన్ స్ట్రోక్ వలన అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పిత్వరగా కోలుకోవాలని కోరారు. కిషోర్ కుమార్‌రెడ్డి, నాగరాజా, రఘుపతిరాజు, మొగిలి గజేంద్ర పాల్గొన్నారు.

## 28న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**ప్రజాశక్తి- తిరుపతి సిటి :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో 28న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయంలో ఫిబ్రవరి 4వ తేదీ రథసప్తమి జరగనుంది. ఈ సందర్భంగా ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ఉదయం 6.30 నుండి 9.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 9 గంటల నుండి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. ఈకారణంగా జనవరి 28న కల్యాణోత్సవం, సహస్రదీపాలంకారసేవలను టీటీడీ రద్దు చేసింది.

## 'ద్రావిడ'లో న్యాక్ బృందం పర్యటన

విశ్వవిద్యాలయంలో పర్యటిస్తున్న న్యాక్ బృందం

**ప్రజాశక్తి- కుప్పం టౌన్:** ద్రావిడ విశ్వవిద్యాలయంలో న్యాక్ బృందం పర్యటన రెండవ రోజుకు చేరుకుంది. మొదటి రోజు పర్యటనలో భాగంగా విశ్వవిద్యాలయ అధికారులతో, తాత్కాలిక సిబ్బందితో, విద్యార్థులతో వేరువేరుగా సమావేశమైన న్యాక్ బృందం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడంతో మొదటి రోజు పర్యటన ముగిసింది. రెండవ రోజు పర్యటనలో భాగంగా విశ్వవిద్యాలయ దత్తత గ్రామాలలో పర్యటించిన బృందం ఆయా గ్రామాలలో విశ్వవిద్యాలయం తరపున జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని వివిధ కేంద్రాలను పరిశీలించారు. విశ్వవిద్యాలయంలోని క్రీడాప్రాంగణాలను, వ్యాయామ శాలలను, వసతి గృహాలలో పర్యటించి, పరిశీలించారు. అలాగే విశ్వవిద్యాలయ పూర్వవిద్యార్థులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహించారు.

## సాంప్రదాయ బద్ధంగా పశువుల పండుగ

**ప్రజాశక్తి - రామకుప్పం:** మండల కేంద్రంలో పశువుల పండుగను రైతులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గురువారం ఉదయం రైతుల పశువులను శుభ్రం చేసి రంగురంగుల కాగితాల పూలను అలంకరించారు. అనంతరం దేవర ఎద్దులకు మంగళ వాయిద్యాలు, టపాకాయలు బాణాసంచా పేల్చుతూ గంగమ్మ ఆలయం వద్దకు చేరుకొని విశేష పూజలు చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రజలు సుఖ సంతోషాలతో పండుగ జరుపుకోవాలన్నారు. అనంతరం పరుగులు తీస్తున్న పశువులను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమందిగా జనం తరలివచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు వెంకట మోహన్, నరేష్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## జరిమానా చెల్లించకుంటే వాహనం సీజ్ : ఎస్ఐ

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** బైరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గత సంవత్సరం తనిఖీలు చేయబడిన వాహనాలపై విధించిన జరిమానాలు, అపరాధ రుసుమం కొందరు వాహనదారులు ఇప్పటి వరకు ప్రభుత్వ అకౌంట్లో జమ చేయలేదని వెంటనే చెల్లించకుంటే వాహనాలు సీజ్ చేస్తామని ఎస్సై పరశురాముడు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జరిమానా చెల్లించవల్సిన వారు మీ సేవా కేంద్రాల్లో, గ్రామ సచివాలయంలో, స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించి జరిమానా చెల్లించాలని తెలిపారు.

## శిలాఫలకం ధ్వంసం

**నిందితులను వెంటనే అరెస్టు చేయాలి : సర్పంచ్**

ధ్వంసమైన శిలాఫలకాన్ని చూపుతున్న సర్పంచ్

**ప్రజాశక్తి- వెదురుకుప్పం:** మండలంలోని తిప్పినాయుడుపల్లి పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన శిలాఫలకాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని కొంతమంది వ్యక్తులు ధ్వంసం చేశారని వారిని వెంటనే అరెస్టు చేయాలని సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్ డిమాండ్ చేవారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి సంబంధించిన అభివృద్ధి శిలాఫలకాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖచిత్రాన్ని ధ్వంసం చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. అభివృద్ధితో పోటీ పడాలి తప్ప ఇటువంటి విధ్వంసాలకు పాల్పడే వారిని శిక్షించాలని ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు సూచించారు.

## 'గగన్ మూన్'కు మాడ్యూల్ సిద్ధం

**ప్రజాశక్తి-సూళ్లూరుపేట:** గగన్ మూన్ సన్నాహక ప్రయోగాల్లో భాగంగా నిర్వహించే మానవరహిత అంతరిక్ష యాత్ర కోసం క్రూ మాడ్యూల్ను సిద్ధం చేసినట్లు ఇస్రో వెల్లడించింది.బెంగళూరు లోని లిక్విడ్ ప్రొపల్షన్ సెంటర్లో మాడ్యూల్కు ప్రొపల్షన్ వ్యవస్థలను అనుసంధానం చేసిన తర్వాత శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రానికి పంపినట్లు ఇస్రో తెలిపింది. అన్ క్రూ మిషన్ను మార్చి నెలలో, మానవసహిత మిషన్ను వచ్చే ఏడాది ప్రయోగించే అవకాశమున్నట్లు పేర్కొంది.

# పోలీస్ మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం

పోలీస్ మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అడిషనల్ ఎస్పీ

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** జిల్లాలో నింద్ర పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ సెప్టెంబర్ 19వ తేదీన అనారోగ్యం కారణంగా మరణించిన పిసి 4583 పి.వినోద్ కుమార్ సతీమణి కళావతికి కార్పస్ ఫండ్ నుండి గురువారం రూ.1,00,000ల చెక్కును చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఇంచార్జ్ అడ్మిన్ రాజశేఖర్ రాజు జిల్లా పోలీస్ కార్యాలయ ఏఏఓ దస్తగిరి, క్లర్క్ పార్థసారథి నాయుడు సమక్షంలో అందజేసారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చనిపోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పోలీస్ శాఖ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ డిపార్టుమెంటు తరపున కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలు ఆలస్యమవ్వకుండా చూస్తామని, ఏవైనా సమస్యలుంటే నిరభ్యంతరంగా సంప్రదించవచ్చని తెలిపారు.

# పెద్ద చెరువులో చెత్త వేస్తే కఠిన చర్యలు

**మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి**

వ్యర్థాలను శుభ్రం చేయిస్తున్న కమిషనర్

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరు పెద్ద చెరువులో కొంతమంది చెత్తాచెదారం, మాంసం దుకాణాల వ్యర్థాలను వేయడం వలన రోడ్డుపైన వెళ్లేటువంటి ప్రయాణికులకే కాకుండా ఆ చుట్టుపక్కల ఉన్నటువంటి ప్రజలకు కూడా చాలా ఇబ్బందిగా ఉందని చెరువులో చెత్తాచెదారం వేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి హెచ్చరించారు. గురువారం పెద్ద చెరువును పరిశీలించి మరువలోని వ్యర్థాలను జెసిబి సాయంతో శుభ్రం చేయించారు. ఆయన మాట్లాడుతూ చెరువుల్లో వ్యర్థాలను వేయడం వలన ప్రజలు అనేక వ్యాధులు బారిన పడుతున్నారని, ఎవరూ చెరువు కట్ట పైన గాని చెరువు పరిసర ప్రాంతాల్లో ఎటువంటి చెత్తాచెదారం డంపింగ్ చేసినా కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం కింద కూడా మున్సిపాలిటీ పరిధిలో గల ప్రదేశాలలో పరిశుభ్రం చేసే కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు**

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి చూపాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో పారిశుధ్య నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్య లోపం లేకుండా పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ల నిర్వహణపై శ్రద్ధ వహించి గ్రామాలలో తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా చేపట్టి వీటి ద్వారా వర్మీ కంపోస్టును తయారు చేయాలని ఆదేశించారు. గ్రామాలలో హౌస్‌టాక్స్‌ను సక్రమంగా వసూలు చేయాలన్నారు. అంతకుముందు కమ్మనపల్లి, బైరెడ్డిపల్లి ఎస్‌డబ్ల్యూపిసి సెంటర్లను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. బైరెడ్డిపల్లి ఆర్డినేటర్ షణ్ముగం, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఈవోపిఆర్ అండ్ డిఆర్‌టీజీ ప్రసాద్ పాల్గొన్నారు.

# పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**పశువైద్య అధికారి డాక్టర్ శ్రీవిద్య**

**ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన పశు వైద్యశిబిరాలను ప్రతి గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తారని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య తెలిపారు. గురువారం మండలంలోని పద్మాపురం, ఎన్ఆర్ పురం గ్రామంలో వైద్యశిబిరాన్ని నిర్వహించి పశువులకు గర్భకోశ వ్యాధులకు మందులు, నట్టల నివారణ అందించారు. టిడిపి యూనిట్ ఇంచార్జ్ మాధవ నాయుడు, మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య నాయుడు, వెటర్నరీ అసిస్టెంట్లు భూషణ ఇంద్ర పాల్గొన్నారు.

**సోమల:** పశువులు, గొర్రెలు, మేకల యజమానులు తప్పనిసరిగా మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని పశు వైద్యాధికారిని చందన ప్రియ కోరారు. గురువారం పేటూరు గ్రామంలోని 285 పశువులకు పిడుదుల మందు పిచికారి, 51 దూడలకు, 220 పశువులకు నట్టల నివారణ మందు తాపించడం, గర్భకోస వ్యాధితో బాధపడుతున్న 38 పశువులకు చికిత్స అందించారు. అలాగే 700 గొర్రెలు మేకలకు, 40 కోళ్ళకు వ్యాక్సినేషన్ వేయడం జరిగిందని తెలిపారు. పశు వైద్య సిబ్బంది బలరాం, వెంకటరమణ, రామకృష్ణ, ఆలీ, ఓబులేసు, బావాజాన్, మధు సురేంద్ర పాల్గొన్నారు.

# 'మహిళా సాధికారత' పై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి- పలమనేరు:** పలమనేరులోని ఎస్విసిఆర్ డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం మహిళా సాధికారతపై జాతీయ అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఆర్థిక శాస్త్ర విభాగం అధికారి రుక్మిణి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వరహించారు. కార్యక్రమంలో సిడిపిసి మెంబర్ సెక్రటరీ శ్రీపురం సీతారామయ్య మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పలమనేరులోని ఎస్విసిఆర్ డిగ్రీ కళాశాలకు రత్నారెడ్డి గంగిరెడ్డి సహాయ సహకారాలతో కళాశాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ జాతీయ మహిళా సాధికారత అవగాహన సదస్సు సద్వినియోగం చేసుకుని రత్నా రెడ్డిని ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని కోరారు. తిరుపతి నుండి వచ్చిన సుమతి రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాలలో స్త్రీ ప్రముఖపాత్ర వహిస్తుందని, స్త్రీల మీద పురుషాధిక్యతను నిర్మూలించాలని అన్నారు. ప్రొఫెసర్ రాధా మాట్లాడుతూ స్త్రీలు స్వయం ఉపాధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న 14 స్త్రీ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో పురోగతి సాధిస్తేనే సమాజం అగ్రస్థానంలో ఉంటుందన్నారు.

# ప్రపంచ సవాళ్లను అధిగమిద్దాం

**ప్రజాశక్తి-, శ్రీకాళహస్తి**

ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా శాస్త్ర సాంకేతిక రంగాల్లో పెను మార్పులు, కొత్త ఆవిష్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకత చాలా ఉందని తిరుపతి ఐఐటి డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక తిరుపతి ఐఐటీలో గురువారం పాన్-ఐఐటి వరల్డ్ ఆఫ్ టెక్నాలజీ (పివోట్) శాటిలైట్ ఈవెంట్‌ను ఇవాళ నిర్వహించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ శాస్త్రవేత్తలు, ఐఐటీ పూర్వ విద్యార్థులు, స్థానిక విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీల్స్ గ్లోబల్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ), రాష్ట్ర సహకారంతో కార్యక్రమం జరిగింది. సీఐఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీ మురళీ కృష్ణ, రతన్ అగర్వాల్, వీల్స్ ఫౌండేషన్ నుంచి మూర్తి శంకరన్ లు శక్తిపై వారి దక్కోణాలను పంచుకున్నారు. తిరుపతి ఐఐటీ, వీల్స్ మధ్య కుదిరిన ఎంఓయుపై గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ డీన్ శశిధర్ గుమ్మా, వీల్స్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రతన్ అగర్వాల్ సంతకం చేశారు. విక్షిత్ భారత్ కోసం సైద్ధాంతిక పరిశోధనలు జరగాలని నిపుణులు ఆకాంక్షించారు. సుస్థిరమైన అభివద్ధి కోసం, ఆచరణాత్మక అనువర్తనాల మధ్య అంతరాన్ని తగ్గించడంపై పలువురు ఉపన్యాసాలు ఇచ్చారు.

# క్రైం న్యూస్

## మూడేళ్ల బాలికపై లైంగిక వేధింపులు

**ప్రజాశక్తి- విజయపురం (నగరి):** మండలంలోని కావేటిపురం హరిజనవాడకు చెందిన మూడేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు రెండు రోజుల క్రితం లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం బాలిక చెప్పడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మహేశ్వర్ తెలిపిన వివరాల మేరకు బాలిక శరీరంపై చెప్పలేని ప్రాంతాల్లో ముద్దులు పెట్టాడని, వీడియో చిత్రీకరించాడని పేర్కొన్నారు. ఈ మేరకు నిందితుడు మోహన్ (26)ను అదుపులోకి తీసుకొని అతనిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

## మహిళ అనుమానాస్పద మృతి

మృతురాలు స్వప్న

**ప్రజాశక్తి- కుప్పం టౌన్ :** కుప్పం పట్టణం పలార్లపల్లి ప్రాంతానికి చెందిన స్వప్న (24) మృతి స్థానికంగా కలవరం రేపింది. పలార్లపల్లి గ్రామానికి చెందిన యువకుడితో అదే గ్రామానికి చెందిన మృతురాలికి నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగినట్లు మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి భర్త వివాహేతర సంబంధం పెట్టుకుని గత కొంతకాలంగా తమ కుమార్తెను హింసిస్తున్నారని, అదనపు కట్నం ఇవ్వాల్సిందిగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీలు సైతం జరిగినట్టు తెలిపారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున తమ కుమార్తె ఆత్మహత్య చేసుకున్నట్టు తమకు తెలిసిందన్నారు. అయితే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత బలహీనురాలు కాదని, తమ కుమార్తె మరణానికి అత్తింటివారే కారణమని అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. సమాచారాన్ని అందుకున్న పట్టణ పోలీసులు స్థలానికి చేరుకుని, ప్రాథమిక విచారణ చేపట్టి, కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించి, మృతదేహాన్ని శవ పరీక్షా నిమిత్తం పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి మరణానికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

## 28, 29 తేదీల్లో... ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

**ప్రజాశక్తి - నాయుడుపేట:** ఈనెల 28, 29 తేదీల్లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో జరగనున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి భగత్‌రవి పిలుపునిచ్చారు. గురువారం ఎస్ఎఫ్ఐ మహాసభల పోస్టర్స్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విడుదల చేశారు. రవి మాట్లాడుతూ నాయుడుపేటలోని విద్యారంగ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిదులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతి గృహాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యారంగ సమస్యలపై చర్చించి, భవిష్యత్ ఉద్యమాలను మహాసభల్లో రూపొందించుకుంటామని తెలిపారు. నాయకులు మనోజ్, వరప్రసాద్, సుకుమార్, సూర్య పాల్గొన్నారు.

## 'లా' సెమిస్టర్ ఫలితాలను తక్షణమే విడుదల చేయాలి

**ప్రజాశక్తి - క్యాంపస్:** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ పీజీ డిపార్ట్మెంట్ ఆఫ్ లా లో నిర్వహించిన 2022-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను తక్షణమే విడుదల చేయాలని వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడుకి నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేత సుందర్ మాట్లాడుతూ ఎల్ ఎల్ ఎం కోర్సు సంబంధిత రెండు, నాలుగు సెమిస్టర్ ఫలితాలు జాప్యం కావడం వలన అనేకమంది విద్యార్థులు తమ యొక్క ఉపాధి అవకాశాలను కోల్పోయి నిరుద్యోగులుగా మారుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ నిదానం కోటేశ్వరరావు, రెడ్డి మోహన్ పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో ఆక్వాకల్చర్ పురోగతి కీలకం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** దేశాభివృద్ధిలో ఆక్వాకల్చర్ పురోగతి కీలకమనీ మలేషియాలోని టెరెంగాను డైరెక్టర్ డా.ఎం.హెచ్.డి. ఇఖ్వానుద్దీన్ అబ్దుల్లా పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అప్లైడ్ మైక్రోబయాలజీ అండ్ బయోటెక్నాలజీ సహకారంతో 23 జనవరి 2025 న ఆరోగ్య వ్యవసాయం, పర్యావరణ సుస్థిరత, మైక్రోబియల్ టెక్నాలజీ, బయో ఇంజినీరింగ్‌లో గ్లోబల్ అడ్వాన్స్‌లపై 2 రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మలేషియాలోని టెరెంగాను డైరెక్టర్ డా.ఎం.హెచ్.డి. ఇఖ్వానుద్దీన్ అబ్దుల్లా మాట్లాడుతూ క్రస్టేసియన్ ఆక్వాకల్చర్ పురోగతి గురించి వివరించారు. ఆక్వా కల్చర్ నిర్వాహణ, ప్యాకింగ్, మార్కెటింగ్ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో విసి ప్రొ.వి.ఉమ, ప్రొఫెసర్.టి.సుధ, సదస్సు కన్వీనర్ ప్రొ.ఆర్.జయ మాధురి, డైరెక్టర్ ప్రొ.పి.సువర్ణలతాదేవి, కో కన్వీనర్ ప్రొ.చండీకుమారి, ప్రొ.పి.జ్యోస్న, ఆర్.ఉష, జాన్ సుష్మ, బి.కిషోరి పాల్గొన్నారు.

## న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్ ఏర్పాటు



**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు కె.రమణయ్య ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. గోంగోర, చిర్రాకు, తోటాకు, మెంతాకు, బెండకాయ, చిక్కుడు, సొరకాయ, బీరకాయ, ముల్లంగి తదితర కూరగాయల విత్తనాలను నాటించారు. ఈ కిచెన్ గార్డెన్ ద్వారా విద్యార్థులకు పోషకాలతో కూడిన మెనూ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్ర, ధనంజయులు, కిషోర్, మస్తానయ్య, శ్రీహరి, ఆయమ్మ పాల్గొన్నారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఎంఇఓ పరిశీలించారు.

**CHANGE OF NAME**

I, **C. INDRA** (Old Name), wife of Army No.14842580Y, Rank: NAIK **KIRAN KUMAR S**, residing at #2-15,196 Thimmaiahpalli Village, 197 Ramapuram Post, Gudipala Mandal, Chittoor District, AP hereby inform that in my husband's army record my name was recorded as **C.INDRA**. I have changed my name as **K.INDRA**(New Name)